క్లుప్తంగా

అమృత్ 2.0 పనుల్లో వేగం పెంచాలి



అమరచింత: ఆత్మకూర్, అమరచింత పట్టణాల్లో చేపడుతున్న అమృత్ 2.0 తాగునీటి పనుల నిర్మాణంలో వేగం పెంచి, అనుకున్న సమయంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి అందించాలని డీఈ శ్రీనివాస్‌రావు అన్నారు. పట్టణంలో చేపడుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి రూ.11 కోట్లతో రెండు వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నామని వెల్లడించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 6 లక్షల లీటర్లు, దశమి కట్ట సమీపంలో 5 లక్షల లీటర్ల వాటర్‌ట్యాంకులను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు పట్టణంలో 10 కిలో మీటర్ల మేరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి తాగునీరు చేరే విధంగా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈఈ చంద్రశేఖర్, మెగా కంపెనీ మేనేజర్ నరాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

వనపర్తి కార్టూనిస్ట్ ప్రతిభ



వనపర్తిటౌన్: కార్టూనిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి రవీంద్ర భారతిలో సత్కళాభారతి, హాస్యానందం మాస పత్రిక సంయుక్తంగా నిర్వహించిన కార్టూన్ పోటీలో వనపర్తికి చెందిన కొండకింది శేషిరెడ్డి గెలుపొందారు. ఈ మేరకు సినీ నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, మాటల రచయిత తనికెళ్ల భరణి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, కళావేదిక సభ్యులు బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాసులు, డాక్టర్ శ్యాంసుందర్, ఉపాధ్యాయులు శేక్యానాయక్, విజయభాస్కర్‌రెడ్డి, బౌద్ధారెడ్డి, రాములు, కురుమూర్తి, బక్కయ్య, రవీందర్ శేషిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



ఆత్మకూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు తప్పవని, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని వ్యవసాయశాఖ ఏడీఏ దామోదర్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని విత్తన, ఫర్టిలైజర్స్ షాపులను వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల నిల్వలు, వాటి కంపెనీలు, గడువు తేదీలు, లైసెన్సు, స్టాక్ రిజిస్టర్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాక అధికారి వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



పాన్‌గల్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ, జీపీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ గోవింద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము మాట్లాడుతూ.. జీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు మూడు, నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో నాగన్న, బాలస్వామి, తిరుపతయ్య, సుగ్రీవుడు, లాల్య, చందు, శివ, చంద్రశేఖర్, వెంకటయ్య, హర్జునయ్య, కుర్మయ్య పాల్గొన్నారు.

టీజీఆర్‌జేసీలో విద్యార్థి ప్రతిభ

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన పెబ్బేటి మనోజ్ టీజీఆర్‌జేసీ సెట్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో 456 ర్యాంకు సాధించాడు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపడంపై పాఠశాల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ భానుప్రకాష్, పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

మినీస్టేడియాలకు రూ.2.80 కోట్లు

- ఆత్మకూర్, అమరచింతలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఏర్పాట్లు
- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, పక్కన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని, క్రీడాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం సాయంత్రం ఆత్మకూర్‌లోని మినీ స్టేడియాన్ని రాష్ట్ర గీత కార్మిక విభాగం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్‌తో కలిసి సందర్శించారు. స్థానిక క్రీడాకారులు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, షటిల్ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని అభినందించారు. షటిల్ క్రీడాకారులకు ఉపయోగపడేలా రూ.1.80 కోట్ల నిధులతో షటిల్ ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీను, నాగేష్, దామోదర్, సాయిరాఘవ, మచ్చేందర్‌గౌడ్, అశోక్, రఫీఖ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

అమరచింత: గ్రామీణ క్రీడాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు పాఠశాల ఆవరణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నిధులు త్వరలోనే విడుదల చేసి, పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు డ్వాక్రా రుణాలను అందిస్తూ వారి కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నామని తెలిపారు.

ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ

పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఏఐటీయూసీ జెండాను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్మిక హక్కులను కాపాడుకుంటూ వారి సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్, ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీలు తిరుమలేష్, మహంకాళి విష్ణు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రభుదాస్, బాలరాజ్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులైనా ధాన్యం తరలలే..

- కొనుగోలు కేంద్రంలోనే 9 వేల బస్తాల ధాన్యం
- లారీల కొరతే కారణం
- పట్టించుకోని అధికారులు



ముమ్మళ్లపల్లి కొనుగోలు కేంద్రంలో తూకం చేసిన వరిధాన్యం బస్తాలు

కొత్తకోట రూరల్: మండలంలోని ముమ్మళ్లపల్లి శివారులో పీఏసీఎస్, కొత్తకోట వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో నెల రోజులైనా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు దొడ్డు రకం ధాన్యం ఉండటంతో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, మరోవైపు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించేదుకు లారీలు లేకపోవడంతో పాటు వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా రైతుల ధాన్యం బస్తాలు తడిపోతాయోననే ఆందోళనలో ఉన్నారు. సాగుకు ముందే దొడ్డు రకం విత్తనాలను ప్రభుత్వం నిషేధిస్తే.. ఇప్పుడు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొనేవారం కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు ధాన్యం కాంటా చేసేందుకు ఎదురు చూస్తుండటంతో మరికొందరు రైతులు కాంటా చేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు లారీలు ఎప్పుడు వస్తాయోనని కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. మిల్లులకు ధాన్యం కేటాయింపు ఆలస్యం కావడంతో పాటు కేటాయించిన మిల్లులు నిండడంతో లారీలను పంపడంలో ఆలస్యమవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. కొందరు లారీల యజమానులు బస్తాకు రూ.2 అదనంగా రైతులు చెల్లిస్తేనే లారీలను పంపిస్తామని డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ధాన్యాన్ని తూకం చేయడంతో పాటు కొనుగోలు కేంద్రాలకు లారీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

డీ–2 మైనర్ కాల్వలో నీటి ప్రవాహం తగ్గించాలి



కాల్వ సమీపంలోని పొలాల్లో నీటి నిల్వలు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి శివారులోని కేఎల్ఐ డీ–2 మైనర్ కాల్వ ద్వారా అధికంగా ప్రవహించే నీటిని తగ్గించి పంట పొలాలను కాపాడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. కాల్వ సమీప రైతులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వ ద్వారా అధికంగా సాగునీరు అందుతోందని, వరద వచ్చినప్పుడు కాల్వ సమీపంలోని నార్లకుంట, రామయ్యకుంట, మొగుళ్ల చెరువుకు సాగునీరును మళ్లించేవారు. గతేడాది నుంచి మైనర్ కాల్వకు ఎక్కువ నీరు వచ్చేందుకు కొందరు రైతులు ప్రభుత్వ అనుమతి లేకుండా జేసీబీలతో కాల్వను వెడల్పు చేశారన్నారు. దీంతో కాల్వ సమీప పొలాల్లోకి నీరు వచ్చి పంటలకు నష్టం కలుగుతుందని వాపోయారు. పొలాలకు నీరు చేరుతుండటంతో పంటలు పండించలేక బీడుగా పెట్టామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కరించడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైనర్ కాల్వకు మరమ్మతులు చేసి కాల్వకు అధిక నీటి ప్రవాహం రాకుండా షట్టర్ బిగించడమా లేదా కేఎల్ఐ కాల్వ నీటిని భీమా కాల్వకు లింక్ చేసి నీటి ప్రవాహం తగ్గేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

ఖిల్లాఘనపురం: వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై అందించే జీలుగ విత్తనాలు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏఓ మల్లయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 100 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను ప్రభుత్వం కేటాయించగా.. మొదటి విడతలో 50 క్వింటాళ్లు వచ్చాయన్నారు. 50 శాతం సబ్సిడీతో 30 కిలోల జీలుగ విత్తనాల బస్తాకు రూ.2,138 రైతులు చెల్లించాలన్నారు. ఒక బస్తా విత్తనాలు 2.5 ఎకరాలకు సరిపోతుందని ఏఓ తెలిపారు. విత్తనాలు కావల్సిన రైతులు పొలం పాసుబుక్కు, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని ఆయా గ్రామాల ఏఈఓలను సంప్రదించాలని కోరారు.

42 ట్రిప్పుల ఇసుక వేలం

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ గ్రామంలో డంపు చేసిన 42 ట్రాక్టర్ల ఇసుకకు గురువారం ఉదయం 11:30 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుగుణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ సూచనల మేరకు ఒక్కో ట్రిప్పుకు ప్రభుత్వం ధర రూ.1,800 చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొని ఎవరు ఎక్కువ ధర చెల్లిస్తే వారికి ఇసుక ఇస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు సకాలంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని తహసీల్దార్ కోరారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



అమరచింత: ట్రాక్టర్ డ్రైవర్లు రోడ్డు నిబంధనలను పాటించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సురేష్ తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, యాజమానులకు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాల రిజిస్ట్రేషన్, లైసెన్స్ వివరాలు అందుబాటులో ఉండాలన్నారు. నిబంధలు అతిక్రమిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత...

పట్టణానికి చెందిన గొల్ల రామకృష్ణ సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో.. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని బాధితుడికి బుధవారం అందించారు.

‘మిల్లర్లపై కేసులు నమోదు చేయాలి’



చిట్యాల మార్కెట్‌లో ధాన్యం పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

వనపర్తి రూరల్: తాలు, తరుగు పేరుతో ప్రతి క్వింటాల్‌కు మూడు నుంచి ఐదు కిలోల ధాన్యం దోచుకుంటున్న మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. వారు బుధవారం చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి రైతులతో కలిసి వరి ధాన్యాన్ని పరిశీలించారు. ప్రతి బస్తాకు 40 కిలోల తూకం వేయాల్సి ఉండగా 41 కిలోల తూకం వేసి రైతులకు నష్టం చేస్తున్నారన్నారు. వీటిని లారీలో మిల్లుకు పంపితే అక్కడ ప్రతి క్వింటాల్‌కు 3 నుంచి 5 కేజీల తరుగు తీస్తున్నారని ఆరోపించారు. శ్రీరంగాపురం మండలానికి చెందిన కొందరు మిల్లర్లు బరి తెగించి ఐదు కిలోల తరుగు తీసేందుకు ఒప్పుకుంటేనే లారీల నుంచి ధాన్యం దించుకుంటాం, లేదంటే తీసుకెళ్లాలని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. మిల్లర్లపై ఆధారపడకుండా అధికారులు ప్రత్యేక గోదాంలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, రైతులు పాల్గొన్నారు.

అహల్యాబాయి నేటి తరానికి ఆదర్శనీయం



మాట్లాడుతున్న నాగపరిమళ

వనపర్తిటౌన్: పదేళ్లకు పెళ్లై, పెళ్లైన కొన్నేళ్లకే భర్త యుద్ధంలో మరణిస్తే రాజ్యం బాధ్యతలు తీసుకొని పాలన చేసిన అహల్యాబాయి హోల్కార్ సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర సమన్వయకర్త నాగపరిమళ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో అహల్యాబాయి 300వ జయంతిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఆలయాలను మసీదులుగా మారుస్తున్న కాలంలో రాణి అహల్యాబాయి తన సంస్థానం నుంచి వచ్చిన ఆదాయంతో దేశంలో అనేక సంస్థానాల్లో హిందూ ఆలయాలను నిర్మించారని కొనియాడారు. ఆమె చేసిన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం రాణి అహల్యా హోల్కర్ పేరిట స్త్రీ శక్తి పురస్కారాన్ని, ఇండోర్ విమానాశ్రయానికి రాణి అహల్యాబాయి హోల్కర్ అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేశారన్నారు. కార్యక్రమంలో లోక్‌నాథ్‌రెడ్డి, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, విజయలక్ష్మి, శ్రీశైలం, అక్కల రామన్‌గౌడ్, జ్యోతి రమణ, సుమిత్రమ్మ, బండారు కుమారస్వామి, ఎ.సీతారాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, వారణాసి కల్పన పాల్గొన్నారు.

విద్యార్థులకు లక్ష్యం నిర్దేశించాలి



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి విద్యావిభాగం: విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం హైస్కూల్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని బుధవారం ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించి, దాన్ని సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమములో సెంటర్ ఇన్‌చార్జ్ జ్యోతి, జిల్లా రిసోర్స్ పర్సన్ శ్రీనివాసులు, సుదర్శన్‌రావు, మల్లేశ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

శిక్షణతో బోధనా నైపుణ్యాలు

పాన్‌గల్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు శిక్షణ ద్వారా బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ రెండో రోజు ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలో పిల్లలకు అభ్యాసన సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొత్తగా ప్రభుత్వం కృత్రిమ మేధ (ఏఐ)ను ప్రారంభిస్తోందని, ఆ దిశగా ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీలు నర్సింహారావు, రాందాసు, ఆస్మానాజ్‌బేగం, రవికుమార్, బస్తీరాం, వెంకటేష్, కృష్ణ, బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామర్థ్యాలు పెంచేందుకే..

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ జయశంకర్ అన్నారు. మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్పీలు మహేష్, రాకేష్, అక్తర్, జానకీరాం, మద్దిలేటి, బాలమ్మ, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు



నాగసానిపల్లిలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

వనపర్తి రూరల్: చిన్న పిల్లలను పనిలో పెట్టకూడదని, ఒకవేళ వారిని పనిలో పెట్టుకుంటే యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో ఉపాధి కూలీలకు బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అనవసర లింక్‌లు నొక్కితే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు పోగొట్టుకునే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రవికుమార్, శివరాం, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



ఎంసీహెచ్ కార్డును పరిశీలిస్తున్న సీహెచ్ఓ రామయ్య

పాన్‌గల్: చిన్నారులకు, గర్భిణులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీహెచ్ఓ రామయ్య అన్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి సబ్‌సెంటర్‌లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీకాలు వేయించుకోవడంతో అంటువ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని, పౌష్టికాహారం తదితర అంశాలపై గర్భిణులు, చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు మొదటి, రెండో డోస్ టీడీ వ్యాక్సిన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ వ్యాక్సిన్‌తో ఏ రోగం తగ్గుతుంది అని తెలుసుకోవడానికి మాతా శిశు సంరక్షణ కార్డు (ఎంసీహెచ్) వ్యాక్సినేషన్ పుస్తకం చదివితే తెలుస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యుడు తారాశశాంక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



ఆత్మకూర్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఖిల్లాఘనపురంలో..

సాక్షి, నెట్‌వర్క్: రాజీవ్ గాంధీ ప్రధానిగా దేశానికి అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. బుధవారం రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- ఖిల్లాఘనపురంలో మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రమేష్, సాయిచరణ్‌రెడ్డి, దేవిజానాయక్, నాగేశ్వర్, ఆగారం ప్రకాష్, ప్రభాకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.
- గోపాల్‌పేట మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్యశీలారెడ్డి, శివన్న, నాగేశ్, సుధాకర్‌రావు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.
- అమరచింత పట్టణంలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు తిరుమలేష్, మహంకాళి విష్ణు, పోసిరిగారి విష్ణు, హనుమంతు నాయక్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోకి వర్షం నీరు



వీపనగండ్ల కొనుగోలు కేంద్రంలో వర్షపు నీరు

వీపనగండ్ల: వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన రైతులకు అకాల వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో కొనుగోలు కేంద్రాల్లోకి నీరు చేరి ధాన్యం తడిసిపోతుంది. మండల కేంద్రంలోని చర్చి వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నీరు నిలుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని, లేకుంటే తీవ్రంగా నష్టపోతామని రైతు చిన్న ఊశన్నతో పాటు మరి కొందరు వేడుకుంటున్నారు.

తడిసిన ధాన్యం

వనపర్తి రూరల్: అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి ముద్దయ్యింది. బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి కేంద్రాల్లో ధాన్యంపై కవర్లు కప్పినా అడుగు భాగాన నీరు చేరుతుండంతో రైతులకు ధాన్యం కాపాడుకోవడం కష్టంగా మారింది. శ్రీరంగాపురం మండల కేంద్రంతో పాటు కంభాళపురం, జానంపేట, వెంకటాపురం, నాగసానిపల్లి, శేరుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇంకా 80 శాతం ధాన్యం నిల్వ ఉంది. శేరుపల్లి కొనుగోలు కేంద్రంలో దాదాపు 40 వేల బ్యాగుల ధాన్యం ఉంది. ఇప్పటి వరకు కేవలం 1400 బస్తాల ధాన్యం మాత్రమే కాంటా చేశారు. పెబ్బేరు మార్కెట్ యార్డులో, సూగూరు, రంగాపురం, శాఖాపూర్, తోమాలపల్లి, ఈర్లదిన్నె, గుమ్మడం, అయ్యవారిపల్లి, కంచిరావుపల్లి గ్రామాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్వాహకులు, మిల్లర్ల నిర్లక్ష్యానికి తాము బలైపోతున్నామని రైతులు వాపోతున్నారు.



శేరుపల్లిలో..



సూగూరులో..